క్లుప్తంగా

విద్యార్థులకు కిట్ల పంపిణీ



విద్యార్థులకు కిట్లు అందిస్తున్న సర్పంచ్ చందక లక్ష్మి తదితరులు

తగరపువలస: ఆనందపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు స్థానిక సర్పంచ్ చందక లక్ష్మి సోమవారం 'సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు' పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధ్యాయులు, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కామేశ్వరరావు, చందక సూరిబాబు, ఎంపీటీసీ సభ్యురాలు రమ, కొట్యాడ సత్యమూర్తి, రెడ్డి బాబు, బంటుపల్లి లక్ష్మి, కంచుబోయిన శ్రీను ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసాలు



అనంతవరం పాఠశాలలో అక్షరాభ్యాసం చేస్తున్న చిన్నారులు

పద్మనాభం: మండలంలోని రెండు పాఠశాలల్లో సోమవారం సామూహిక అక్షరాభ్యాసాలు జరిగాయి. చిన్నాపురం మోడల్ ప్రైమరీ పాఠశాలలో పది మందికి అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సోమేష్, ఉపాధ్యాయులు సంజయ్, రెడ్డి పాల్గొన్నారు. అనంతవరం మోడల్ ప్రైమరీ పాఠశాలలో ఏడుగురు విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ కార్యకర్త పద్మావతి విద్యార్థులతో ఈ కార్యక్రమం నిర్వహించారు.

యోగాంధ్రపై సమావేశం నేడు

పద్మనాభం: విశాఖపట్నం బీచ్ రోడ్డులో ఈ నెల 21న జరగనున్న యోగాంధ్రపై మంగళవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

140 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు



తాటితూరులో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

తగరపువలస: భగవాన్ సత్యసాయిబాబా శత జయంత్యుత్సవాలను పురస్కరించుకుని భీమిలి మండలం తాటితూరులో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 140 మందికి పరీక్షలు నిర్వహించారు. సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో 40 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో సర్పంచ్ శిరిగుడి సంతోషి, వైద్యురాలు గౌతమి, శంకర్ ఫౌండేషన్ ప్రతినిధి పైడిరాజు, ఎంవీ సత్యసాయికుమార్, పతివాడ రాంబాబు, కొయ్య శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సరకుల పితలాటకం



పిట్టా వారి గుట్ట వద్ద వేచి ఉన్న లబ్ధిదారులు

తగరపువలస: అంగన్‌వాడీల ద్వారా లబ్ధిదారులకు సరఫరా చేసే సరకులు గతంలో వారి అనుమతి పొందిన వారు వచ్చినా ఇచ్చేవారు. దీంతో లబ్ధిదారుల ఇంట్లో ఉండే భర్త, తల్లి, అత్త లేదంటే ఎవరో ఒకరు వచ్చి సరుకులు తీసుకునే వారు. ఇటీవల నిర్వాహకులు ఈ విధానానికి స్వస్తి పలికారు. లబ్ధిదారునితో పాటు ఎస్కార్ట్ వచ్చేవారికి కలిపి సరకులు ఇస్తామనడంతో అంగన్‌వాడీలకు వచ్చిన వారు విస్తుపోయారు. తెలిసిన ముఖాలకే సరకులు ఇవ్వకుండా గర్భిణులు, బాలింతలు రావాలంటే ఎలా కుదురుతుందని వాపోయారు. చివరకు సరకులు లేకుండానే ఉత్త చేతులతో ఇళ్లకు వెళ్లవలసి వచ్చింది.

సత్యదేవుని ఆలయంపై నిర్లక్ష్యపు నీడ

- కొండకు పొంచి ఉన్న ముప్పు
- ప్రమాదకరంగా కొండ చరియలు
- శిథిలమైన మెట్లు
- కుంగిన కొండ పైభాగం
- పట్టించుకోని దేవదాయశాఖ అధికారులు



కొండపై ఆలయంలో శ్రీరమాసత్యనారాయణస్వామి

తగరపువలస: కొండపై శ్రీరమాసత్యనారాయణ స్వామి కొలువుదీరిన ఆలయం, ఉప ఆలయాలకు ప్రమాదం పొంచి ఉంది. తగరపువలసకు ల్యాండ్ మార్క్‌గా పిలుచుకునే ఈ ఆలయాన్ని పునరుద్ధరించి పూర్వ వైభవం తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.


ఇక్కడ కొండ దిగువ భాగం నుంచి పై వరకు ఏడు ఆలయాలు, గీతామందిరం ఉన్నాయి. వీటిలో శ్రీరమా సత్యనారాయణస్వామి ఆలయం దేవదాయశాఖ ఆధీనంలో ఉంది. కొండకు ఇరువైపులా మెట్ల మార్గం ద్వారా సుమారు 150 మెట్లు ఎక్కి కొండపై ఆలయానికి చేరుకోవచ్చు. కొండ పైభాగంలో శ్రీరమాసత్యనారాయణ స్వామి ఆలయం పక్కన మండపంలో తరచూ వ్రతాలు, పెళ్లిళ్లు జరుగుతుంటాయి. కానీ గత 20 ఏళ్లుగా కొండపై కల్యాణాలు, వ్రతాలు చేసుకోవడానికి అనువుగా లేదు. కొండపై ప్రహరీ పాక్షికంగా కూలిపోవడంతో పాటు ఆలయం పక్కన భాగం క్రుంగిపోయింది. దీంతో దీని ఆధారంగా ఉన్న కొండభాగంతో పాటు ఆలయం ఎదురుగా కొండ చరియలు వర్షపునీటికి విచ్చిపోయి ఏ క్షణమైనా కూలడానికి సిద్ధంగా



శిథిలమైన మెట్ల మార్గం



ఆలయం పక్క కుంగిపోయిన కొండభాగం



చెట్ల వేళ్ల మధ్య ఇరుక్కుని నిలబడిన కొండ చరియలు

ఉన్నాయి. ప్రస్తుతం కొండపై ఉన్న వృక్షాల వేళ్లను పట్టుకుని మాత్రమే మెట్ల మార్గంలో రాళ్ల బీటలు వారి వేలాడుతున్నాయి.

కొండ దిగువ భాగం నుంచి ఎడమవైపు కొండపైకి చేరుకునే మార్గంతో పాటు కుడివైపు నవగ్రహాల మండపం మీదుగా రాకపోకలు సాగించే మార్గాలు అన్నీ దాదాపు శిథిలమైపోయాయి. పదేళ్ల క్రితం ఇక్కడి సత్యసాయిబాబా మందిరానికి ఇలాగే బీటలు వారితే, ఇక్కడి నుంచి తరలించారు. అలాగే శివాలయం, గీతా మందిరాన్ని ఆధునికీకరించారు. మిగిలినా ఆలయాలకు మాత్రం ముప్పు తొలగిపోలేదు. కొండపైకి వచ్చే భక్తులకు వాష్‌రూమ్‌లు, తాగునీరు వంటి వసతులు కల్పించకపోవడంతో ఇటీవల భక్తుల తాకిడి తగ్గింది.

ప్రతిపాదనలతోనే సరి

శ్రీరమాసత్యనారాయణస్వామి ఆలయానికి వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని కొండపై ఆలయం చుట్టూ ప్రహరీ, రక్షణగోడ, మరమ్మతులు, మెట్ల మార్గం నిర్మాణం, ప్రమాదకరమైన కొండచరియలకు గ్రాఫ్టింగ్ వంటి పనులు చేయిస్తామని దేవదాయశాఖ ప్రతిపాదనలు తయారు చేసినా ఇప్పటికీ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. వసతుల లేమితో పాటు కొండపై ప్రమాదకరమైన పరిస్థితుల కారణంగా ఇటీవల దేవదాయశాఖ కొండపై దేవుని సన్నిధిలో వివాహాలు సైతం నిలిపివేసింది. తూర్పుగోదావరి జిల్లా అన్నవరం సత్యదేవుని సన్నిధికి వెళ్లలేనివారికి, తగరపువలసలోని ఈ ఆలయం 80 ఏళ్లకు పైగా అందుబాటులో ఉంది. దేవదాయశాఖ ఇప్పటికైనా పూర్తిస్థాయిలో పరిశీలన జరిపి అవసరమైన మరమ్మతులు చేయించి, వసతులు కల్పించాలని భీమిలి ప్రాంత భక్తులు కోరుతున్నారు.



మెట్ల మార్గంలో విచ్చిపోయి ప్రమాదకరంగా కొండ రాళ్లు

నమ్మకమైన దేవుడు



శ్రీరమా సత్యనారాయణమూర్తులంటే మాకెంతో నమ్మకం. ఈ ప్రాంత ప్రజలు చల్లగా ఉండటానికి వారే కారణం. ఈ కొండపై వివాహాలు జరిపిస్తే ఆ జంటలకు శుభప్రదం. చిరకాలం జీవించి ఉంటారు. ప్రస్తుతం ఆలయ పరిస్థితి చూస్తే దయనీయంగా ఉంది. భక్తులకు వసతులు కల్పించాలి. –వెంపాడ ఆదిలక్ష్మి, సంతపేట

పూర్తిగా మరమ్మతులు చేయించాలి



150 కిలోమీటర్ల దూరంలో ఉన్న అన్నవరం సత్యదేవుని చెంతకు వెళ్లలేని వారు తగరపువలస కొండపై ఆలయంలో వ్రతాలు ఆచరించి నెమ్మది పొందుతారు. కార్తీకమాసం నెలరోజులు ఆలయం కిటకిటలాడుతుంది. ఇంత ప్రాధాన్యం గల ఆలయాన్ని దేవదాయశాఖ ఇన్నేళ్ల పాటు పట్టించుకోకుండా వదిలేసింది. ఈ ఆలయానికి పూర్తిగా మరమ్మతులు చేయించాలి. –తమ్మిన కూర్మారావు, బంగ్లామెట్ట

కొండచరియలు ప్రమాదకరంగా ఉన్నాయి



కొండ పైకి వెళ్లే భక్తులకు విరిగిన, శిథిలమైన కొండ చరియలు ఆందోళన కలిగిస్తున్నాయి. మెట్ల దిగువ భాగం నుంచి ఆలయం వరకు లైట్లు పునరుద్ధరించాలి. కొండ పైభాగం విస్తరిస్తే భక్తులకు వీలుగా ఉంటుంది. – తెడ్లాపు అప్పలరాజు, తగరపువలస

'యోగాంధ్ర' ప్రాంతాల పరిశీలన



ఎండాడ లా కాలేజీ రోడ్డులో పరిశీలన చేస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులు

మధురవాడ: ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొననున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఎండాడ లా కాలేజీ రోడ్డులో యోగా నిర్వహించే ప్రాంతాలను పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు సోమవారం పరిశీలించారు. వీరిలో అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, అడిషనల్ ఎస్పీ దేవప్రసాద్, కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా తదితరులు హైవే నుంచి లా కాలేజీ రోడ్డులోకి వెళ్లే ప్రాంతాలతో పాటు, యోగా నిర్వహించేందుకు ఏర్పాటు చేయనున్న కంపార్ట్‌మెంట్ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాకు చెందిన వారు హైవే లా కాలేజీ రోడ్డు నుంచి హరిత మీదుగా తిమ్మాపురం బీచ్ రోడ్డు కలిసే ప్రాంతం వరకు ఉన్న రోడ్డులో యోగాసనాలు నిర్వహిస్తారన్నారు. ఇక్కడికి వచ్చే 50వేల మందికి 23 కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. అనకాపల్లి జిల్లా నుంచి 1250 బస్సుల్లో వీరిని ఇక్కడకి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇందులో పలువురు పోలీసు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు ముర్రా జాతి ఆబోతుల వేలం

ఆరిలోవ: పశు సంవర్థక శాఖ జిల్లా కార్యాలయ ఆవరణలోని ఆంధ్రప్రదేశ్ లైవ్‌స్టాక్ ఏజెన్సీ(ఏపీఎల్‌డీఏ)కి చెందిన ఫ్రోజన్ సెమెన్ బుల్ స్టేషన్‌లో ముర్రా జాతికి చెందిన నాలుగు ఆబోతులను ఈ నెల 18న వేలం వేయనున్నట్లు ఉప సంచాలకుడు డాక్టర్ రెడ్డి నీలయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమంతవాక వద్ద విమ్స్ ద్వారం పక్కన పాత డెయిరీఫారం ప్రాంగణంలో బుధవారం ఉదయం 10 గంటలకు వేలం జరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆసక్తి గల రైతులు వివరాల కోసం 81427 28872 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

అన్నవరంలో రైతుల ఆందోళన



సర్వే నంబర్ 101/1లో ఆందోళన చేస్తున్న రైతులు

తగరపువలస: భీమిలి మండలం అన్నవరం పంచాయతీలో రైతులు సోమవారం ఆందోళన చేశారు. ఇక్కడ సర్వే నంబర్ 101/1లో పాతికేళ్ల క్రితం 28 మంది డ్వాక్రా మహిళలకు అప్పటి ప్రభుత్వం కేటాయించిన 14 ఎకరాల స్థలాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం వెనక్కు తీసుకుని మై ఫెయిర్ హోటల్ నిర్మాణానికి కేటాయించినట్టు తెలిపారు. పైల శ్రీను అనే వ్యక్తి మాట్లాడుతూ కార్పొరేట్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద అప్పట్లో కేటాయించిన భూములలో మహిళలు తోట పంటలు సాగు చేసుకుంటున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇదే సర్వే నంబర్‌లోని స్థలాలను స్టార్ ఒబెరాయ్ హోటల్ గ్రూప్‌నకు కేటాయించినప్పుడు రైతుల భూములకు ప్రతిఫలంగా ఎకరానికి 20 సెంట్లు ఇచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం ఇక్కడ కాకుండా ఎక్కడో ఒకచోట ఎకరానికి ప్రతిఫలంగా 5 సెంట్లు మాత్రమే ఇస్తాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తమకు తెలియకుండా భీమిలి రెవెన్యూ అధికారులు మూడు రోజులుగా తమ భూములను చదును చేసి విలువైన తోటలను తొలగించిందన్నారు. తమకు తెలియకుండా, న్యాయం జరగకుండా ఎవరికి భూములు కేటాయించినా ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ నెల 14న కొందరు రైతులను రోజంతా భీమిలి పోలీస్ స్టేషన్‌లో కదలనీయకుండా ఉంచారని ఆరోపించారు. ఇదిలా ఉండగా సర్వే నంబర్ 101/1లో మొత్తం 199.28 ఎకరాల భూములలో అన్నవరం, తూడెం పంచాయతీ వాసులు తోటపంటలను సాగు చేసుకుంటున్న సంగతి తెలిసిందే.

గుర్తు తెలియని వ్యక్తులు వస్తే సమాచారం అందించండి



హోటల్ నిర్వాహకులతో సమావేశమైన మెరైన్ సీఐ శ్రీనివాసరావు

కొమ్మాది: ఈ నెల 21వ తేదీన జిల్లాలో నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వస్తున్నందున తీరంలో భద్రత మరింత పటిష్టం చేశామని మెరైన్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. రుషికొండలోని మెరైన్ పోలీస్‌స్టేషన్‌లో ఎండాడ, సాగర్‌నగర్, రుషికొండ ప్రాంతాల్లో హోటల్స్, లాడ్జి నిర్వాహకులతో సోమవారం సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తు తెలియని వ్యక్తులు వచ్చినట్లయితే, వారికి ఎటువంటి ఆశ్రయం కల్పించవద్దని, తమకు వెంటనే సమాచారం అందించి సహకారం అందించాలని కోరారు. ఇప్పటికే భీమిలి నుంచి జోడుగుళ్ల పాలెం మత్స్యకారులతో పలుమార్లు సమావేశాలు ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మల్లికార్జున శర్మ జయంత్యుత్సవాలు



గురువులను సత్కరిస్తున్న సంతోష్‌కుమార్

తగరపువలస: సికింద్రాబాద్‌కు చెందిన సంగీత విద్వాన్ ఆకెళ్ల మల్లికార్జున శర్మ 87వ జయంతి ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. జీవీఎంసీ రెండో వార్డు సంగివలసలో రెండు రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించారు. అలాగే శ్రీగురురాజా మ్యూజికల్ ఇన్‌స్టిట్యూట్ 11వ వార్షిక వేడుకలు కూడా ముగిసినట్లు వ్యవస్థాపకుడు విజినిగిరి సంతోష్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ తన గురువు మల్లికార్జునశర్మ వద్ద తనకు జీవితాన్ని ఇచ్చారన్నారు. ఆయన వద్ద మూడేళ్ల శిష్యరికం చేసి ఇంతటివాడినయ్యానన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. విద్యార్థులతో కలిసి అన్నమాచార్య, త్యాగరాజు, రామదాసు కీర్తనలు ఆలపిస్తూ వయోలిన్, కీబోర్డు సహకారం అందించారు. ఆహూతులను ఈ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

పాపం దివ్యాంగుడు..

సీఎంను కలిసే అవకాశం లేక నిరాశగా వెనక్కి..



దివ్యాంగుడు సంతోష్ కుమార్

పీఎం పాలెం: అసలే దివ్యాంగుడు.. ఆపై అమ్మానాన్నా లేరు. వెనుకా ముందూ ఎవరూ లేని ఏకాకి. ముఖ్యమంత్రిని నేరుగా కలిసి తన గోడు వినిపించుకోవచ్చని గంపెడాశతో వచ్చిన అతడిని ప్రవేశద్వారం వద్ద లోపలికి అనుమతించకపోవడంతో దీనంగా వెనుదిరిగాడు.. వివరాలివి.. అక్కయ్యపాలెం జగన్నాథపురానికి చెందిన పెట్ల సంతోష్ కుమార్ (38) దివ్యాంగుడు. ఒంటరిగా జీవనం వెళ్లదీస్తున్నాడు. ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ తప్ప ఆధారం లేదు. టెన్త్ పాసైన అతడు తనకు ఏదో ఉద్యోగం లేదా ఉపాధి కల్పించాలని ముఖ్యమంత్రికి విన్నవించేందుకు సోమవారం సాయంత్రం పీఎం పాలెంలోని వీ కన్వెన్షన్ సెంటర్ వద్దకు వచ్చాడు. సుమారు రెండు గంటల పాటు కన్వెన్షన్ పరిసరాల్లోనే వేచి ఉన్నాడు. సాయంత్రం 6 గంటల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వస్తున్న సమయంలో తను కూడా లోపలకు వెళ్లడానికి దేకుతూ బయల్దేరగా పోలీసులు అడ్డుకున్నారు. ఇది అన్యాయమని వారితో వాదనకూ దిగినా ఫలితం లేకపోయింది. లోపలికి అనుమతించకపోవడంతో చీకటిలో నిరాశగా వెనుదిరిగాడు.

'స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కానీయవద్దు'

తగరపువలస: స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కానీయవద్దని కోరుతూ సోమవారం బైపాస్‌రోడ్డులో సిటు నాయకులు ఆందోళన చేపట్టారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ స్థానికులకు అవగాహన కల్పించారు. ప్రధాని మోదీ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే ప్రయత్నంలో భాగంగానే 4వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారన్నారు. ఉక్కు శిబిరంపై పోలీస్ నిర్బంధం తొలగించాలన్నారు. కార్మికులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, ప్లాంట్‌లో 6వేల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. విశాఖ వస్తున్న ప్రధాని మోదీతో స్టీల్ ప్లాంట్‌కు అనుకూలంగా చంద్రబాబు ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. ఆర్ఎస్ఎన్ మూర్తి, ఎస్.అప్పలనాయుడు, పంపాన సూర్యనారాయణ, బాబాజీ, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చే వరకు పోరాడతాం

- ప్రజల పక్షాన నిలబడతాం
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు
- 'జగన్ అంటే నమ్మకం – చంద్రబాబు అంటే మోసం' పుస్తకావిష్కరణ



'జగన్ అంటే నమ్మకం- చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు తదితరులు

కొమ్మాది: 'చేతకాని హామీలతో గద్దెనెక్కిన సీఎం చంద్రబాబు ప్రజలను మోసం చేస్తుంటే చూస్తూ ఊరుకోం. ప్రజల పక్షాన నిలబడతాం. ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చే వరకు పోరాటాలు ఆగవు' అని వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) అన్నారు. ఎండాడలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'జగన్ అంటే నమ్మకం – చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకాన్ని నియోజకవర్గ నాయకులతో కలసి సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయినా ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని, ఈ నేపథ్యంలో చంద్రబాబు చేస్తున్న మోసాలు అరాచకాలు వివరిస్తూ పుస్తకాన్ని ఆవిష్కరించామని తెలిపారు.

సూపర్ సిక్స్ పథకాలు ఇచ్చామనడం హాస్యాస్పదం

చంద్రబాబు ప్రజలను మోసం చేయడం కొత్త ఏమీ కాదని ఎన్నికలు జరిగినప్పుడు ఒక మాట, ఫలితాలు వచ్చిన తరువాత ఒక మాట మాట్లాడతారన్నారు. ప్రతిపక్ష పార్టీలు సమస్యలను లేవనెత్తితే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. గత ఎన్నికల్లో చంద్రబాబు సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలు ఇచ్చారు. కేవలం సూపర్ సిక్స్ పథకాల కోసం ఏటా రూ. 81 వేల కోట్లు వెచ్చించాలి. ఏడాది అవుతున్నా ఒక్క సూపర్ సిక్స్ పథకాన్నైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఏడాదికి రూ. 81 వేల కోట్లు బాకీ పడిందని గుర్తు చేశారు. మేము చేస్తున్న పోరాటాల కారణంగా ఏడాది తరువాత తల్లికి వందనం పథకం అమలు చేశారు. అది కూడా పూర్తి స్థాయిలో చేయలేక చేతులెత్తేశారన్నారు. గత ప్రభుత్వ హయాంలో అమ్మఒడి నిధుల నుంచి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి వెయ్యి రూపాలు కట్ చేస్తే అది జే ట్యాక్స్ అంటూ ప్రచారం చేశారని, మరి ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తుంది ఏమిటని ప్రశ్నించారు. ఏడాది అవుతున్నా రైతన్నలకు అన్నదాత సుఖీభవ లేదు.. ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు 50 ఏళ్లకే పింఛను అన్నారు, అదీ లేదు.. ఆడబిడ్డ నిధి కింద ప్రతి నెలా రూ. 1500 ఇస్తామన్నారు, అదీ లేదు.. ఉచిత ఆర్టీసీ బస్సు అన్నారు, అదీ లేదు.. నిరుద్యోగ భృతి అన్నారు, అదీ లేదు. ఏడాదికి మూడు సిలిండర్లు అని ఒక సిలిండర్ ఇచ్చారు. ఏదీ చేయకుండానే సూపర్ సిక్స్ పథకాలు ఇచ్చామని చెప్పడం హాస్యాస్పదమన్నారు.

ప్రశ్నించే వారి గొంతు నొక్కేస్తున్నారు

ఈ పాలనలో ప్రశ్నించేవారి గొంతు నొక్కేస్తున్నారని మజ్జి శ్రీను అన్నారు. ఆడపిల్లలకు రక్షణ కరువైందన్నారు. బాలికలపై అఘాయిత్యాలు, దోపిడీలు, కబ్జాలు తప్ప ఏమీ కనిపించడం లేదన్నారు. మండల పరిషత్, జిల్లా పరిషత్ నిధులు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా సంక్షేమాన్ని, అభివృద్ధిని సమపాళ్లలో నడిపించిన ఘనత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. చంద్రబాబు చేస్తున్న మోసాలను, వెన్నుపోటు రాజకీయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్తపై ఉందని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు సుంకర గిరిబాబు, కోరాడ వెంకట్రావు, కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, ఎంపీపీ వాసురాజు, మండల అధ్యక్షులు గాడు శ్రీను, బంక సత్యం, వైస్ ఎంపీపీ బోని బంగారు నాయుడు, వార్డు అధ్యక్షులు గుడ్ల పోలిరెడ్డి, పోతిన శ్రీనివాస్, పోతిన హనుమంతు ముఖ్య నాయకులు చిల్లా కరుణాకరరెడ్డి, వంకాయల మారుతీ ప్రసాద్, అక్కరమాని రామనాయుడు, జగ్గపిల్లి ప్రసాద్, ఇల్లాపు వెంకట్రావు, బొడ్డు దుర్గారావు, జగ్గపిల్లి నరేష్, చెన్నాదాసు, మహిళా నాయకులు పిల్లా సుజాత, ముదుండి రాజేశ్వరి, బెందాళం పద్మావతి, చేకూరి రజిని తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ పరామర్శ



నాగోతి బాబయ్యమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న చిన్న శ్రీను తదితరులు

తగరపువలస: భీమిలి మండలం తాటితూరులో సర్పంచ్ శిరిగుడి సంతోషి అత్తగారు గున్న ఇటీవల మరణించిన సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు సోమవారం పరామర్శించారు. సంతోషి భర్త ఈశ్వరరావు, మామ అప్పారావు తదితరులతో మాట్లాడారు. ఆమెకు నివాళులు అర్పించారు. ఆయన వెంట స్థానిక నాయకులు దాట్ల పెదబాబు, సుంకర గిరిబాబు, దంతులూరి వాసురాజు, బోని బంగారునాయుడు, గాడు శ్రీను తదితరులు పాల్గొన్నారు. అనంతరం జీవీఎంసీ పరిధిలోని పలువురు కార్యకర్తల ఇళ్లకు చిన్న శ్రీను వెళ్లి పరామర్శించారు.



తాటితూరులో సర్పంచ్ సంతోషి, ఈశ్వరరావు కుటుంబ సభ్యులతో మజ్జి శ్రీను

నాగోతి బాబయ్యమ్మకు నివాళి

మధురవాడ: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు నాగోతి తాతారావు, అప్పారావుల మాతృమూర్తి దివంగత బాబయ్యమ్మకు మజ్జి శ్రీనివాసరావు నివాళులు అర్పించారు. బాబయ్యమ్మ ఆదివారం మృతి చెందడంతో చంద్రంపాలెంలోని ఆమె కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులను ఆయన పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షులు పోతి న శ్రీనివాసరావు, పోతిన హనుమంతురావు, గుడ్ల పోలిరెడ్డి, వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

'జ్యూట్‌మిల్లు భూములు విక్రయించవద్దు'

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు భూములు జాయింట్ లేబర్ కమిషనర్ ఆధ్వర్యంలో అటాచ్‌మెంట్‌లో ఉన్నందున యాజమాన్యం కార్మికులకు బకాయిలు చెల్లించే వరకు భూములు విక్రయించకూడదని మిల్లు ఐక్య కార్మిక సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని మరోమారు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జేసీఎల్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు తెలిపారు. సోమవారం జ్యూట్‌మిల్లు ప్రాంతంలో పర్యటించిన నాయకులు మాట్లాడుతూ మిల్లు ప్రతినిధులు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారన్నారు. దీనిని విరమించుకుని కార్మికుల బకాయిలు చెల్లించాలని కోరారు. చిల్ల వెంకటరమణ, జీరు వెంకటరెడ్డి, ఆదినారాయణరెడ్డి, దల్లి అప్పలరెడ్డి, ఈశ్వరరావు, రాంపైడి, దేవుళ్ల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ తల్లికి వందనం అమలు చేయాలి



మాట్లాడుతున్న రాంబాబు

తగరపువలస: ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకుంటున్న ప్రతీ విద్యార్థికి తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని సీపీఐ భీమిలి ఏరియా సహాయ కార్యదర్శి కానూరి రాంబాబు డిమాండ్ చేశారు. గుజ్జు రామునాయుడు భవన్‌లో ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ ఈ పథకం ద్వారా చాలా మంది తల్లుల ఖాతాలలో డబ్బులు జమ కానందున ఆందోళనకు గురవుతున్నారన్నారు. సచివాలయాల చుట్టూ తిరుగుతున్నా సరైన సమాధానం లభించడం లేదన్నారు. చివరి విద్యార్థి వరకు ఈ పథకం డబ్బులు అందకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాయకులు అప్పలరాజు, ఆదినారాయణ, గోవిందరావు, సన్నిబాబు, లక్ష్మణరావు, రామారావు పాల్గొన్నారు.